# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

https://trinetnews.com/

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

1 PM TO 4 PM

సంపుటి: 01 | సంచిక:29 | పేజీలు :02 | వేల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | సోమవారం, సెప్టెంబర్ 14,2026


## 'దమ్ముంటే తలసానిని...'బీఆర్ఎస్‌కు మహేశ్ కుమార్ గౌడ్

# సవాల్

- కేసీఆర్‌పై మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు
- దళితులకు కేసీఆర్ అన్యాయం చేశారని ఆరోపణ
- మూడెకరాలు, దళిత బంధుపై ప్రశ్నలు
- తలసానిని ప్రతిపక్ష నేత చేయాలని డిమాండ్
- కొండా సురేఖను ఢిల్లీకి పిలవడంపై సమాచారం లేదని వెల్లడి



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి కేసీఆర్ మాట తప్పారని ఆరోపించారు. దళిత సమాజం ఆయన్ను ఎప్పటికీ క్షమించదన్నారు. ఓట్ల కోసమే కేసీఆర్ దళిత కార్డును ఉపయోగించారని విమర్శించారు.తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. దళితుల కోసం బీఆర్ఎస్ 2003లో రూపొందించిన డాక్యుమెంట్‌ను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు పథకాలను ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయడం మాత్రమే కాకుండా ఆయన సూచనలను పాటించాలని హితవు పలికారు. దళితుల గురించి మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదన్నారు.దళితులు నడిచిన నేలను శుద్ధి చేసిన బీఆర్ఎస్ నేతలపై మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. "నేలను కాదు.. మీ బుర్రను శుద్ధి చేయాలి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.మాక్ అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు బీసీ నేతకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చారని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. కేసీఆర్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రతిపక్ష నేతగా చేయాలని సవాల్ విసిరారు. కేసీఆర్ ఎలాగూ అసెంబ్లీకి రావడం లేదని, తలసానికి ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ నేతకు ఆ హోదా ఇస్తే సస్పెన్షన్ ఎత్తివేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.ఇదిలా ఉండగా మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ హైకమాండ్ ఢిల్లీకి పిలిచిందన్న వార్తలపై తమకు ఎలాంటి సమాచారం లేదని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ఎవరైనా కబ్జా చేసి ఉంటే.. ఆ వ్యవహారాలు బయటకు రావాల్సిందేనని అన్నారు.

## 'సెమికాన్ ఇండియా'.. హాజరుకానున్న 600కు పైగా గ్లోబల్ దిగ్గజాలు

**ఢిల్లీ,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14:**

భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ తయారీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించే 'సెమికాన్ ఇండియా 2026' 5వ ఎడిషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 17న ఢిల్లీలోని 'యశోభూమి'లో ప్రారంభించనున్నారు.సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ జాతీయ సదస్సును 'సిలికాన్ టు సిస్టమ్స్ బిల్డింగ్ ది ఎకోసిస్టమ్' అనే ఇతివృత్తంతో ఇండియా సెమీకండక్టర్ మిషన్ , విదేశాంగ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అంతర్జాతీయ పరిశ్రమల సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.




### రేసింగ్ ట్రాక్‌పై విజయ్--అజిత్ ఆత్మీయ కలయిక..

## టీవీకే రాజకీయ లాభం కోసమేనా?

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14**




తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, స్టార్ హీరో అజిత్ కుమార్ మధ్య యూకేలో జరిగిన ఆత్మీయ భేటీ ఇప్పుడు రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## హైదరాబాద్ గణేశ్ ఉత్సవాల కోసం ఏఐ డ్రోన్ల నిఘా..

# ఆకాశం నుంచి పటిష్ట భద్రత!

- గణేశ్ ఉత్సవాల భద్రత కోసం
- ఏఐ ఆధారిత డ్రోన్ల వినియోగం
- జనసందోహంపై
- ఆకాశం నుంచి నిరంతర నిఘా
- తోపులాట, గందరగోళాన్ని
- స్వయంగా గుర్తించే సాంకేతికత
- సీసీ కెమెరాలతో అనుసంధానించి
- పటిష్ఠ భద్రతా వ్యవస్థ
- మల్కాజిగిరి పరిధిలో తొలిసారిగా
- ఈ టెక్నాలజీ అమలు



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు14**

హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగే గణేశ్ ఉత్సవాలు, శోభాయాత్రల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు పోలీసు శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగించనుంది. లక్షలాది మంది పాల్గొనే ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ఆకాశం నుంచి నిఘా పెట్టేందుకు కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డ్రోన్లను రంగంలోకి దింపుతోంది. టీజీ క్వెస్ట్‌లో భాగంగా పోలీసు శాఖ పరిచయం చేసిన ఏఐ ఇంటిగ్రేటెడ్ పోలీసింగ్ వ్యవస్థలో ఈ టెక్నాలజీ కీలకం కానుంది.గతేడాది మేడారం జాతరలో విజయవంతంగా ప్రయోగించిన ఈ ఏఐ డ్రోన్ టెక్నాలజీని, ఇప్పుడు హైదరాబాద్ గణేశ్ ఉత్సవాల సందర్భంగా అమలు చేయనున్నారు. తొలిదశలో భాగంగా మల్కాజిగిరి పోలీసుల పరిధిలో భారీగా జనసమూహం ఉండే ప్రాంతాలు, శోభాయాత్ర మార్గాల్లో ఈ డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ చేపడతారు. అనుమానాస్పద కదలికలు, అకస్మాత్తుగా తలెత్తే తోపులాటలు, గందరగోళ పరిస్థితులను తక్షణమే గుర్తించి, వెంటనే స్పందించడం ఈ సాంకేతికత ముఖ్య ఉద్దేశం.

**పాత పద్ధతికి, కొత్త టెక్నాలజీకి తేడా ఇదే..**

ఇంతకుముందు ఉత్సవాల సమయంలో పోలీసులు డ్రోన్లను కేవలం లైవ్ ఫీడ్ చూడటానికి మాత్రమే ఉపయోగించేవారు. సిబ్బంది ఆ దృశ్యాలను నిరంతరం పరిశీలించి పరిస్థితిని అంచనా వేసేవారు. అయితే, కొత్త ఏఐ ఆధారిత వ్యవస్థలో డ్రోన్లే స్వయంగా దృశ్యాలను విశ్లేషించి, అసాధారణ పరిస్థితులను గుర్తిస్తాయి. జనసమూహంలో ఎక్కడైనా గందరగోళం మొదలైతే, ఆ ప్రాంతాన్ని డ్రోన్ వెంటనే గుర్తించి, సంబంధిత దృశ్యాలను కమాండ్ కంట్రోల్ కేంద్రానికి పంపుతుంది. అక్కడి సిబ్బంది ఆ సమాచారాన్ని సమీపంలోని పోలీసు బృందాలకు పంపడంతో వారు వేగంగా ఘటనాస్థలికి చేరుకుంటారు.

**అత్యాధునిక ఫీచర్లతో నిఘా..**

ఈ డ్రోన్లలో థర్మల్ ఇమేజింగ్, నైట్ విజన్ వంటి అత్యాధునిక కెమెరాలు అమర్చారు. దీనివల్ల పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్పష్టమైన దృశ్యాలను చిత్రీకరించవచ్చు. ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా పాత నేరస్థుల కదలికలను గుర్తించేందుకు, జనసమూహంలో తప్పిపోయిన వారిని కనుగొనడానికి కూడా ఈ సాంకేతికత ఉపయోగపడనుంది. భూమిపై ఉన్న సీసీ కెమెరాల నెట్‌వర్క్‌తో ఈ ఏఐ డ్రోన్లను అనుసంధానించి, ఒకేసారి రెండు వ్యవస్థల ద్వారా పర్యవేక్షించడం వల్ల పోలీసులకు భద్రతా పర్యవేక్షణ మరింత సులభతరం కానుంది. సంప్రదాయ గస్తీకి సాంకేతికతను జోడించి, నగరంలో భారీ వేడుకల భద్రతను కొత్త స్థాయికి తీసుకెళ్లేందుకు పోలీసు శాఖ సన్నద్ధమవుతోంది.

# 22ఏపై ఇరకాటంలోపడ్డ బీఆర్ఎస్

## ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తే ఎదురయ్యే పరిణామాలపై ఆందోళన




**హైదరాబాద్, ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్ 14:**

22ఏ నిషేధిత భూముల జాబితా విషయంలో నిన్నమొన్నటి వరకు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ ఇప్పుడు ఇరకాటంలో పడింది. ధరణి రాకముందు, వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో నిషేధిత భూముల పేరుతో జరిగిన అక్రమాలపై అసెంబ్లీ వేదిక గా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉదాహరణలతో సహా వివరించడంతో గులాబీ లీడర్లు ఇరకాటంలో పడ్డారు. మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరుల భూలావాదేవీలకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయడంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. మంత్రి లేవనెత్తిన అంశాలపై హరీష్ రావు కౌంటర్ ఇచ్చినా.. అది సమర్థించుకునే ధోరణిలోనే ఉంది తప్ప పూర్తి స్థాయిలో వివరణ ఇవ్వలేదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటివరకు 22–ఏ బాధితుల కోసం తెలంగాణ భవన్ లో ప్రత్యేకంగా హెల్ప్ లైన్, గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. అయితే, ఇదే అంశంలో హరీశ్ రావు తన రాజకీయ పలుకుబడితో మామకు సాయం చేశారనే విషయం తెరపైకి రావడంతో.. బాధితులకు అండగా నిలుస్తామని చెప్పిన మాటనే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని తూర్పారబట్టడానికి 22– ఏ అంశం రాజకీయంగా ఉపయోగపడుతుందని బీఆర్ఎస్ నేతలు గంపెడాశలు పెట్టుకున్నారు. ఒక దశలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజీనామా చేయాలంటూ హరీశ్ రావు, కేటీఆర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ వేదికగానే ప్రభుత్వ బండారాన్ని బట్టబయలు చేస్తామని ప్రకటనలు చేశారు. తీరా అసెంబ్లీ సెషన్ కు హాజరయ్యే అవకాశం లేకుండా సస్పెన్షన్ కు గురికావడంతో పోటీగా తెలంగాణ భవన్ లో మాక్ అసెంబ్లీ నిర్వహించి నవ్వుల పాలయ్యారు. అదే అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పుకున్నా.. మంత్రి పొంగులేటి చిట్టా విప్పడంతో బాధితుల సంగతేమోగానీ.. తమను తాము డిఫెండ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడంతో పలువురు ఎమ్మెల్యేలు అధిష్టానం పై అసంతృప్తి వెళ్లగక్కారని సమాచారం. గత ప్రభుత్వంలో ఎవరెవరు ధరణి పేరుతో దండుకున్నారో, ఎంతమంది లీడర్లు భూములు కొనుక్కున్నారో, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎవరెవరికి లబ్ధి చేకూర్చారో.. వీటన్నింటినీ మంత్రి పొంగులేటి లెక్కలతో సహా చిట్టా విప్పడంతో బీఆర్ఎస్ నాయకుల్లో ఆందోళన మొదలైంది.

### విచారణ చేపడితే మరిన్ని పేర్లు

బీఆర్ఎస్ హయాంలో నిషేధిత భూముల జాబితా పేరుతో జరిగిన వ్యవహారాలన్నింటిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాలని భావిస్తున్న నేపథ్యంలో.. అది మొదలైతే మరెన్నో పేర్లు బయటకు వస్తాయో, వాటికి సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుందేమోననే భారాస నాయకుల్లో లో అలజడి నెలకొంది. ప్రస్తుతానికి తన్నీరు హరీశ్ రావు, గంగుల కమలాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్లు మాత్రమే బహిర్గతమైనా.. విచారణ సందర్భంగా ఇంకా ఎవరి పేర్లు బయటకు వస్తాయోననే ఆసక్తి ప్రజల్లో నెలకొంది. ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు పరోక్షంగా మల్లారెడ్డి పేరును సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ లో ప్రస్తావించారు. భూముల లావాదేవీల విషయంలో పై ముగ్గురి పేర్లను మంత్రి పొంగులేటి ప్రస్తావించారు. ప్రభుత్వ విచారణ ప్రారంభమైన తర్వాత ఎవరికి నోటీసులు వస్తాయి.. ఎవరి పేర్లు వెల్లడవుతాయి.. ఆ భూముల వ్యవహారం ఎవరికి మెడకు చుట్టుకుంటుందో భారాస నాయకులలో గుబులు పుట్టిస్తుంది.

# దానం నాగేందర్‌పై పెరుగుతున్న విమర్శలు

## దానం రూటే సపరేటు

**హైదరాబాద్,ట్రినెట్ న్యూస్, సెప్టెంబరు14 :**

తెలంగాణ రాజకీయాల్లో సీనియర్ నేతగా గుర్తింపు పొందిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రాజకీయ ప్రస్థానం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఒక పార్టీ నుంచి గెల్చి మరో పార్టీలోకి మారడం, తన స్టయిలే సపరేటు అనే విధంగా దానం నాగేందర్ వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది. దానం నాగేందర్ 1994 నుంచి కాంగ్రెస్ రాజకీయాల్లో కీలకంగా కొనసాగారు. అనంతరం తెలుగుదేశం పార్టీలోకి వెళ్లి, తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఆయన 2018లో అప్పటి బీఆర్ఎస్‌లో చేరి ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తరఫున అదే నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.అయితే 2024 మార్చిలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఆ తర్వాత సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి, కొద్దికాలానికే కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా పోటీ చేయడం ఆయనపై విమర్శలకు ప్రధాన కారణమైందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### పదవే లక్ష్యమా?

దానం నాగేందర్ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే పార్టీ సిద్ధాంతాల కంటే అధికార సమీకరణాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. అధికారం ఎక్కడ ఉంటే అక్కడే దానం నాగేందర్ ఉంటారని అధికార పార్టీ లోని కొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగా మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు.



# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ..

## ఏమిటీ ఘట్టం? ఎందుకు చేస్తారు?



**తిరుమలలో సెప్టెంబర్ 15 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు**

**ఉత్సవాలకు నాందిగా నేడు రాత్రి అంకురార్పణ కార్యక్రమం**

**నవధాన్యాలను మొలకెత్తించి లోక కల్యాణాన్ని ఆకాంక్షించే ఘట్టం ఇది**

**అంకురార్పణకు ముందు మాడవీధుల్లో సేనాధిపతి ఉత్సవం**

**మొలకల ఎదుగుదలే ఉత్సవాల విజయానికి సంకేతమని విశ్వాసం**

**ట్రినెట్ న్యూస్, సెప్టెంబరు14**

కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రం మరో అపురూప ఘట్టానికి సిద్ధమైంది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15వ తేదీన అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ తొమ్మిది రోజుల మహా వేడుకకు శాస్త్రోక్తంగా బీజం వేసే అత్యంత కీలకమైన ఘట్టం "అంకురార్పణ". నేటి (సెప్టెంబర్ 14) రాత్రి 7 గంటల నుంచి 8 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించనున్నారు. అసలు అంకురార్పణ అంటే ఏమిటి? ఈ క్రతువును ఎందుకు నిర్వహిస్తారు? దాని వెనుక ఉన్న అంతరార్థం ఏమిటో వివరంగా చూద్దాం.

### అంకురార్పణ అంటే లోక కల్యాణ సంకల్పం

"అంకురార్పణ" అంటే విత్తనాన్ని నాటడం లేదా బీజావాపనం అని అర్థం. ఏ వైదిక ఉత్సవం ప్రారంభించే ముందైనా ఈ ఘట్టాన్ని నిర్వహించడం ఆగమశాస్త్ర సంప్రదాయం. బ్రహ్మోత్సవాలు ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయవంతంగా జరగాలని, ఈ భూమండలం పాడి పంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ ఈ క్రతువును చేపడతారు. ఇది కేవలం ఒక ఉత్సవానికి నాంది పలకడమే కాదు, సమస్త జీవరాశి సౌభాగ్యాన్ని ఆకాంక్షించే ఒక మహత్తర సంకల్పం.

### సేనాధిపతి ఉత్సవం, మేదిని పూజ

అంకురార్పణ ఘట్టానికి ముందుగా శ్రీవారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీ విష్వక్సేనుల వారికి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. జగద్రక్షకుడైన స్వామివారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించి, ఎలాంటి ఆటంకాలు రాకుండా చూసే బాధ్యతను విష్వక్సేనులవారు తీసుకుంటారని ప్రాశస్త్యం. ఆయన అనుమతి తీసుకున్నాకే అంకురార్పణకు శ్రీకారం చుడతారు. ఆ తర్వాత, నవధాన్యాలు మొలకెత్తించడానికి అవసరమైన పవిత్రమైన పుట్టమన్నును స్వీకరించేందుకు భూదేవిని ప్రార్థిస్తూ "మేదిని పూజ" చేస్తారు. అర్చకులు భూసూక్తాన్ని పఠించి, భూమాతను ప్రసన్నం చేసుకుంటారు.

### పాలికల్లో నవధాన్యాల ఆవాహన

మేదిని పూజ అనంతరం సేకరించిన పుట్టమన్నును "పాలికలు" అని పిలిచే మట్టిపాత్రలలో నింపుతారు. ఈ పాలికల్లో నవగ్రహాలకు సంకేతంగా తొమ్మిది రకాల ధాన్యాలను (నవధాన్యాలు) నాటుతారు. విత్తనాలు చక్కగా మొలకెత్తాలని కోరుతూ ఓషధీసూక్తాలను పఠిస్తారు. ఇందులో సూర్యునికి ప్రతీకగా గోధుమలు, చంద్రునికి బియ్యం, కుజునికి కందులు, బుధునికి పెసలు, బృహస్పతికి శనగలు, శుక్రునికి అలసందలు, శనికి నువ్వులు, రాహువుకు మినుములు, కేతువుకు ఉలవలు చొప్పున విత్తుతారు. అనంతరం యాగశాలలో ఈ పాలికల చుట్టూ అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్రృతి, వరుణుడు, వాయుదేవుడు, కుబేరుడు, ఈశానుడితో పాటు మొత్తం 49 మంది దేవతలను ఆవాహన చేసి పూజిస్తారు.

### అక్షతారోపణతో పరిసమాప్తి


ఈ పాలికల్లో నాటిన నవధాన్యాలను బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజుల పాటు అత్యంత శ్రద్ధగా పెంచుతారు. ఉత్సవాల చివరి రోజున ఏపుగా పెరిగిన ఈ మొలకలను (అంకురాలు) తీసి, స్వామి వారికి అక్షతారోపణగా సమర్పిస్తారు. ఈ అంకురాలు ఎంత ఆరోగ్యంగా, పచ్చగా ఏపుగా పెరిగితే బ్రహ్మోత్సవాలు అంత ఘనంగా, విజయవంతంగా జరిగినట్లు భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ విధంగా, ప్రకృతిని, దేవతలను ఆరాధిస్తూ, లోక క్షేమాన్ని కాంక్షిస్తూ నిర్వహించే ఈ అంకురార్పణ ఘట్టంతోనే శ్రీవారి బ్రహ్మోత్సవాల వైభవం ప్రారంభమవుతుంది.

## నేడు ఢిల్లీ పోలీసుల ఎదుట లొంగిపోనున్న

# తెహల్కా మాజీ చీఫ్ ఎడిటర్

**ట్రినెట్ న్యూస్, సెప్టెంబరు14**

తెహల్కా మాజీ చీఫ్ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్ సోమవారం ఢిల్లీ పోలీసుల ఎదుట లొంగిపోనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయన సరెండర్ కానున్నారు. మహిళా జర్నలిస్టుపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు 2013లో ఆయనపై కేసు నమోదైంది. దీంతో ఆయన్ను దోషిగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు గోవా బెంచ్ పదేళ్ల జైలుశిక్ష విధించింది. ఆ తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లొంగుబాటు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అప్పీల్‌ను విచారించాలంటే ముందుగా లొంగిపోవాలని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.కాగా.. 2013లో జూనియర్ సహోద్యోగినిపై అత్యాచారం చేసిన కేసులో తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. అయితే.. గతంలో ట్రయల్ కోర్టు ఆయన్ను నిర్దోషిగా ప్రకటించింది. ఆ తీర్పును బాంబే హైకోర్టు రద్దు చేసింది. 2013లో గోవాలో జరిగిన ఓ కార్యక్రమంలో హోటల్ లిఫ్ట్‌లో తేజ్‌పాల్ తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. దీంతో అదే ఏడాది నవంబర్‌లో ఆయన్ను అరెస్ట్ చేశారు పోలీసులు. విచారణ అనంతరం 2021లో గోవా ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే, ఆ తీర్పును గోవా ప్రభుత్వం.. బాంబే హైకోర్టులో సవాలు చేసింది. అప్పీల్‌ను విచారించిన హైకోర్టు.. ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేస్తూ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.




**తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, స్టార్ హీరో అజిత్ కుమార్ మధ్య యూకేలో జరిగిన ఆత్మీయ భేటీ ఇప్పుడు రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దాదాపు మూడు దశాబ్దాలుగా ఆ ఇద్దరు నటుల అభిమానుల మధ్య వైరం ఉంది.**

# రేసింగ్ ట్రాక్‌పై విజయ్--అజిత్ ఆత్మీయ కలయిక.. టీవీకే రాజకీయ లాభం కోసమేనా?

**ట్రినెట్ న్యూస్, సెప్టెంబరు14**

దాదాపు మూడు దశాబ్దాలుగా ఆ ఇద్దరు నటుల అభిమానుల మధ్య వైరం ఉంది. ఇప్పుడు విజయ్, అజిత్ ఒక్కచోట కలవడం ఒకవైపు ఆసక్తి రేపితే.. మరోవైపు రేసింగ్ ఈవెంట్‌ను విజయ్ ప్రారంభించడం, తమిళనాడులో ప్రపంచ స్థాయి మోటార్ రేసింగ్ సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలకు అజిత్ మద్దతు ఇవ్వడం.. ఈ పరిణామాలన్నీ టీవీకే రాజకీయ వ్యూహంపై కొత్త చర్చకు తెరతీశాయి. కొన్నేళ్లుగా విజయ్, అజిత్‌ను వారి అభిమానులు రజనీకాంత్, కమల్ హాసన్ జోడీకి వారసులుగా భావిస్తున్నారు. సాధారణంగా విజయ్ మాస్ అప్పీల్‌ను ఆయన అభిమానులు రజనీకాంత్‌తో పోలిస్తే.. అజిత్‌ను ఆయన ఫ్యాన్స్ విలక్షణ నటుడు కమల్ హాసన్‌తో పోలుస్తారు. ఆ ఇద్దరి నటుల అభిమానుల మధ్య గొడవ తెరమీదే పరిమితం కాలేదు. గత కొన్నేళు ్లగా సోషల్ మీడియా వేదికలపైనా ఇరు వర్గాలు దుమ్మెత్తి పోసుకుంటున్నాయి. అలాగే నడి వీధుల్లోనూ గొడవ పడిన దృష్టాంతాలూ ఉన్నాయి. తాజాగా యూకేలో విజయ్, అజిత్ మధ్య జరిగిన ఆత్మీయ కలయిక వారి ఫ్యాన్స్‌లో ఆసక్తిని కలిగించింది.

### అభిమానులు ఐక్యంగా ఉండాలి: తమిళనాడు మంత్రి

విజయ్, అజిత్‌ల అభిమానులు ఐక్యంగా ఉండాలని, గొడవపడకూడదని తమిళ నాడు మత్స్యశాఖ మంత్రి ఎ.శ్రీనాథ్ కోరారు. 'తమిళ సినిమాకు తల అజిత్, దళపతి విజయ్ పెద్ద స్తంభాలు. ఇప్పటి తరానికి ఇద్దరూ కీలకం. ఇటీవలే యూకేలో జరిగిన ఈవెంట్ ఆ ఇద్దరి మధ్య స్నేహానికి చిహ్నంగా నిలుస్తుంది' అని శ్రీనాథ్ అన్నారు. కాగా.. విజయ్, అజిత్ ఆత్మీయ కలయికను కొందరు అభిమానులు స్వాగతిస్తుండగా.. మరి కొందరు భిన్నంగా స్పందిస్తున్నారు. "ఇద్దరి హీరోలను చూస్తుంటే రజనీకాంత్, కమల్ హాసన్ల పరిపక్వతను చూస్తున్నట్లు ఉంది" అని అజిత్ ఫ్యాన్ ఒకరు పేర్కొన్నారు. ఆ ఇద్దరిని ప్రత్యర్థులుగా చూస్తున్న టైంలో వారు ఆత్మీయంగా పలకరించుకోవడం అద్భుతమని విజయ్ అభిమాని ఒకరు హర్షం వ్యక్తం చేశారు.

### విజయ్ స్వప్రయోజనాల కోసమే ఇదంతా..

విజయ్, అజిత్ భేటీపై అజిత్ అభిమానులు కొందరు భిన్నంగా స్పందించారు. విజయ్ తన స్వప్రయోజనాల కోసమే అజిత్‌ను కలిశారని, రాజకీయ లబ్ధి కోసం విజయ్ అలా కలిసి ఉండవచ్చని చెప్పారు. కాగా.. తమిళనాడులోని రెండు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఉపఎన్నికలు జరగనున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అభ్యర్థులను ఓడించిన అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తర్వాత తమ పదవులకు రాజీనామా చేసి రూలింగ్ పార్టీలో చేరారు. ఇప్పుడు ఆ రెండు చోట్ల ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే, అజిత్ అభిమానులు గత ఎన్నికల్లో టీవీకేకు ఓటు వేయలేదని, ఈ నేపథ్యంలో అజిత్ అభిమానుల ఓట్ల కోసం యూకేలో విజయ్ ఆయనను ఆత్మీయంగా కలిసి ఉండవచ్చని అజిత్ అభిమానులు కొందరు చర్చించుకుంటున్నారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136